PRGI NO: APTEL/26/A1204

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

## అమెరికా దాడిలో మృతి..

## విశాఖకు చేరిన నావికుడు సురేశ్ మృతదేహం

అమెరికా దాడిలో మరణించిన నావికుడు పట్నాల సురేశ్

విశాఖకు చేరిన సురేశ్ మృతదేహం

తమ కుటుంబానికి ఆయనే ఏకైక ఆధారమని భార్య ఆవేదన


కుటుంబానికి అండగా ఉంటామని ప్రభుత్వ విప్ గణబాబు హామీ

విజయవాడ,హైదరాబాద్ సంపుటి 01 సంచిక 75 ఎడిటర్ : కలిదిండి రఘురామ రాజు శనివారం 20 జూన్ 2026 వెల -3 పేజీలు -8

# అమరావతికి కొత్త ఊపు..

## బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణంలో వేగం పెంచండి..

## సీఆర్డీఏ అధికారులకు చంద్రబాబు ఆదేశం



రాజధాని అమరావతిలో బ్యాంక్ స్ట్రీట్ పనులు వేగవంతం చేయాలని సీఎం ఆదేశం

డిజిటల్ మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచన

నివాస వ్యయం తగ్గించి, ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం

ప్రకాశం బ్యారేజీ వద్ద జలక్రీడలతో పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు

సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో రాజధాని అభివృద్ధిపై చంద్రబాబు సమీక్ష



2

## మూసీ రివర్ ఫ్రంట్ కు కేంద్రం అనుమతి.. ధన్యవాదాలు తెలిపిన రేవంత్ రెడ్డి

రక్షణ శాఖ భూములు వినియోగించుకునేందుకు కేంద్రం అనుమతి

83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగించుకోవడానికి క్లియరెన్స్ ఇచ్చిన కేంద్రం

వేగవంతం కానున్న మూసీ ఫేజ్-1 పనులు

తెలంగాణ



2

## సీఎం చంద్రబాబును కలిసిన సాయికృష్ణ తల్లి, కుటుంబ సభ్యులు

విజయవాడ యువకుడు సాయి కృష్ణ అదృశ్యంపై సీఎం చంద్రబాబు స్పందన

బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వ అండ ఉంటుందని హామీ

కేసుపై ఇప్పటికే ఉన్నతస్థాయి దర్యాప్తు జరుగుతోందని వెల్లడి

దోషులు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టీకరణ

మే 9 నుంచి కనిపించకుండా పోయిన సాయి కృష్ణ

విజయవాడ



2

## తెలంగాణపై పవన్ కల్యాణ్ ఫోకస్..

## మణికొండలో జనసేన కొత్త ఆఫీస్

హైదరాబాద్‌లో జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం ప్రారంభం

పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం

జీహెచ్ఎంసీ ఎన్నికలే లక్ష్యంగా పార్టీ బలోపేతంపై జనసేన దృష్టి

హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన అఖండ విజయం స్ఫూర్తితో జనసేన పార్టీ



2

## కోల్‌కతా వెళ్లిన నారా లోకేశ్...

## సీఎం సువేందు అధికారితో కీలక భేటీ

పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారిని కలిసిన ఏపీ మంత్రి లోకేశ్

ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, టెక్నాలజీ వినియోగాన్ని వివరించిన వైనం

బెంగాల్‌లో టీటీడీ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి

మత్స్య సంపద ఎగుమతుల్లో పరస్పర సహకారంపై ఇరువురి మధ్య చర్చ

లోకేశ్ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన సువేందు అధికారి

కోల్‌కతా

ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక సమావేశం జరిగింది. ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను మంగళగిరి చేనేత శాలువాతో సత్కరించారు. 2



## కోల్‌కతాలో పారిశ్రామిక దిగ్గజాలతో నారా లోకేశ్ వరుస భేటీలు

ఏపీకి పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా మంత్రి లోకేష్ కోల్‌కతా పర్యటన

ఈవీ, సోలార్, స్టీల్, ఆగ్రో రంగాల దిగ్గజాలతో వరుస భేటీలు

రాయలసీమలో సోలార్ హబ్, నెల్లూరులో ఈవీ యానోడ్ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

అమరావతి, పారిశ్రామిక కారిడార్లను చూపుతూ పరిశ్రమల స్థాపనకు ఆహ్వానం

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని కంపెనీల ప్రతినిధుల హామీ

కోల్‌కతా

ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. పెట్టుబడులను ఆకర్షించేందుకు ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ కోల్‌కతాలో పలు రంగాలకు చెందిన పారిశ్రామిక దిగ్గజాలతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఈవీ, పునరుత్పాదక ఇంధనం, ఉక్కు, ఆగ్రో-ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల్లో రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని వారికి విజ్ఞప్తి చేశారు. 2



## చంద్రబాబు, నిమ్మగడ్డ రమేశ్ పై అనుచిత వ్యాఖ్యలు..

## కొడాలి నానిపై విచారణకు ఏపీ ప్రభుత్వం అనుమతి

2021 ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో నాని అనుచిత వ్యాఖ్యలు

అప్పట్లో నానిపై విచారణకు అనుమతిని ఇవ్వని వైసీపీ ప్రభుత్వం

కృష్ణా జిల్లా కలెక్టర్ ప్రతిపాదన మేరకు విచారణకు అనుమతించిన ప్రభుత్వం

కృష్ణా జిల్లా

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తన ఘాటు వ్యాఖ్యలతో, బూతు పురాణాలతో నిత్యం వార్తల్లో నిలిచిన మాజీ మంత్రి కొడాలి నానికి కూటమి ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. నాటి పంచాయతీ ఎన్నికల సమయంలో అప్పటి ఎస్ఈసీ (రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి) నిమ్మగడ్డ రమేశ్, అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబుపై కొడాలి నాని చేసిన అత్యంత 2



## బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణంలో వేగం పెంచండి.. సీఆర్డీఏ అధికారులకు చంద్రబాబు ఆదేశం

అమరావతి

రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ముఖ్యంగా బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాజధానిని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో, నివాసయోగ్యమైన నగరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజధాని అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి, అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

సమావేశంలో ప్రధానంగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన అనుమతుల ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకూడదని చంద్రబాబు స్పష్టం చేశారు. బ్యాంక్ స్ట్రీట్‌లో కార్యాలయాల ఏర్పాటుకు 13 బ్యాంకులు ముందుకు రాగా, వాటిలో 11 సంస్థలు తమ భవన నిర్మాణ బాధ్యతలను సీపీడబ్ల్యూడీకి అప్పగించాయని అధికారులు సీఎంకు వివరించారు. ఈ నిర్మాణాలను పూర్తి సమన్వయంతో వేగంగా పూర్తి చేసేలా చూడాలని సీఆర్డీఏ అధికారులకు సూచించారు.

రాజధానిలో డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి అన్నారు. ఫోన్, కేబుల్, ఇంటర్నెట్ వంటి కనెక్టివిటీ సేవల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో డిజిటల్ వసతులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అమరావతిని కేవలం నిర్మించడమే కాకుండా, నివాస వ్యయాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పైప్డ్ గ్యాస్ కనెక్షన్లు, ఇండక్షన్ స్టవ్‌ల వాడకాన్ని ప్రోత్సహించడం, డిస్ట్రిక్ట్ కూలింగ్ వంటి ఆధునిక వ్యవస్థలను అందుబాటులోకి తేవడం ద్వారా ఇది సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.

రాజధాని సుందరీకరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు చెప్పారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువన వైకుంఠపురం వరకు ఏడాది పొడవునా నీరు నిల్వ ఉండేలా చూడటం ద్వారా పర్యాటక అభివృద్ధికి అపార అవకాశాలు ఉంటాయని అన్నారు. జల క్రీడలు, స్విమ్మింగ్ వంటి కార్యకలాపాలను ప్రోత్సహించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో కృష్ణా కరకట్ట నిర్మాణం, ఉండవల్లిలో ఎల్పీఎస్ లేఅవుట్ల అభివృద్ధి, పార్కింగ్ కాంప్లెక్స్, జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణం వంటి ఇతర అంశాలపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ వర్చువల్‌గా పాల్గొనగా, మున్సిపల్, సీఆర్డీఏ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మూసీ రివర్ ఫ్రంట్ కు కేంద్రం అనుమతి.. ధన్యవాదాలు తెలిపిన రేవంత్ రెడ్డి

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, పునరుజ్జీవన ప్రాజెక్టులో ఒక కీలక ముందడుగు పడింది. హైదరాబాద్‌లోని బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుగా అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే రక్షణ శాఖ భూములను వినియోగించుకునేందుకు వీలుగా కేంద్రం పని అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ అనుమతుల ప్రకారం... ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని సుమారు రూ. 533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల రక్షణ శాఖ భూమిని గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అభివృద్ధి పనుల కోసం వినియోగించుకోవడానికి కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది. లీగల్, డిఫెన్స్ నిబంధనల ప్రకారం ఇరు ప్రభుత్వాల మధ్య జరిగిన సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం ఈ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ ప్రక్రియకు కేంద్ర రక్షణ శాఖ తుది ఆమోదం తెలిపింది. దీంతో బాపూఘాట్ పరిసరాల్లో ప్రతిపాదిత అంతర్జాతీయ స్థాయి స్మారక చిహ్నాలు, పర్యాటక హంగుల నిర్మాణానికి ఉన్న ప్రధాన లీగల్ అడ్డంకులు తొలగిపోయాయి.

మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు లభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. "మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధికి సంబంధించి మా ప్రభుత్వం పెట్టుకున్న సుదూర లక్ష్యాలు సాధించడంలో ఇదో చారిత్రాత్మక మైలురాయి. మూసీ పరివాహక ప్రాంతాన్ని కేవలం కాంక్రీట్ కట్టడాలుగా కాకుండా.. పర్యావరణ, సాంస్కృతిక, అద్భుతమైన ప్రజా ఆస్తిగా మార్చడమే మా ప్రభుత్వ ప్రధాన సంకల్పం" అని సీఎం స్పష్టం చేశారు. కేంద్రం ఇచ్చిన క్లియరెన్స్‌తో మూసీ ఫేజ్-1 పనులు మరింత వేగవంతం కానున్నాయి.

## సీఎం చంద్రబాబును కలిసిన సాయికృష్ణ తల్లి, కుటుంబ సభ్యులు

విజయవాడలో సంచలనం సృష్టించిన యువకుడు గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. సాయికృష్ణ కుటుంబాన్ని శుక్రవారం ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో పరామర్శించి, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కేసుపై ఇప్పటికే ఉన్నతస్థాయి విచారణ జరుగుతోందని, దోషులు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులు ఇవాళ స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి సీఎం చంద్రబాబు వద్దకు వెళ్లారు. ఆయనను కలిసి తమ ఆవేదనను విన్నవించుకున్నారు. వారి గోడును ఓపికగా విన్న ముఖ్యమంత్రి, బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

మే 9న ఒక కేసు విచారణ నిమిత్తం కృష్ణలంక పోలీసులు సాయికృష్ణను తీసుకెళ్లారని, అప్పటి నుంచి అతని ఆచూకీ లభించలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇది కస్టోడియల్ డెత్ అయి ఉండవచ్చని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే, సాయికృష్ణ అదృశ్యమయ్యాడని, అతని కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటనపై ఇప్పటికే స్పందించిన ప్రభుత్వం, కృష్ణలంక సీఐ నాగార్జును సస్పెండ్ చేసింది. సింగపూర్ పర్యటన నుంచి తిరిగి వచ్చిన వెంటనే చంద్రబాబు.. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సీఎస్, డీజీపీలతో సమీక్ష నిర్వహించి, నిష్పాక్షిక విచారణకు సీనియర్ ఐపీఎస్ అధికారిని నియమించారు. మరోవైపు, ఈ కేసుపై దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను హైకోర్టు విచారిస్తుండగా, తదుపరి విచారణ జూన్ 29కి వాయిదా పడింది.

## అమెరికా దాడిలో మృతి.. విశాఖకు చేరిన నావికుడు సురేశ్ మృతదేహం

అమెరికా

ఒమన్ గల్ఫ్‌లో అమెరికా జరిపిన సైనిక దాడిలో మరణించిన విశాఖపట్నం వాసి, చీఫ్ మెరైన్ ఇంజినీర్ పట్నాల సురేశ్ (44) మృతదేహం శుక్రవారం నగరానికి చేరుకుంది. ఆయన భౌతికకాయాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ విషాద ఘటనతో శ్రీనివాస్ నగర్‌లోని ఆయన నివాసం ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జూన్ 10న ఒమన్ గల్ఫ్‌లో ప్రయాణిస్తున్న 'ఎంటీ సెట్టెబెల్లో' అనే ఆయిల్ ట్యాంకర్‌పై అమెరికా దళాలు దాడి చేశాయి. ఈ ఘటనలో ట్యాంకర్‌లోని ముగ్గురు భారతీయ సిబ్బంది మరణించగా, 21 మందిని సురక్షితంగా కాపాడారు. మృతుల్లో పట్నాల సురేశ్‌తో పాటు హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఆదిత్య శర్మ, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన శివానంద్ చౌరాసియా ఉన్నారు. మిగతా ఇద్దరి మృతదేహాలను జూన్ 17నే భారత్‌కు తరలించారు.

అమెరికా ఆంక్షలను ఉల్లంఘించి ఇరాన్ నుంచి చమురు రవాణా చేస్తున్నందునే ట్యాంకర్‌పై దాడి చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించింది. అయితే, ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు అమెరికా రాయబారికి సమన్లు జారీ చేసి తన నిరసనను తెలియజేసింది.

ఈ సందర్భంగా సురేశ్ భార్య భార్గవి మాట్లాడుతూ, "మా కుటుంబానికి ఆయనే ఏకైక ఆధారం. ఇప్పుడు నేను నా ఇద్దరు పిల్లలను ఎలా పెంచాలి?" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) సురేశ్ కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం సురేశ్ అంత్యక్రియలు నిర్వహించారు.

## తెలంగాణపై పవన్ కల్యాణ్ ఫోకస్.. మణికొండలో జనసేన కొత్త ఆఫీస్

తెలంగాణలో తన కార్యకలాపాలను విస్తరించే దిశగా కీలక అడుగు వేసింది. పార్టీ అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాద్‌లోని మణికొండలో జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించారు.

మణికొండలోని మల్కం చెరువు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ కార్యాలయంలో తొలుత సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పవన్ కల్యాణ్ పార్టీ జెండాను ఆవిష్కరించి, కార్యాలయంలోకి ప్రవేశించారు. అక్కడ ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి చిత్రపటానికి ఆయన పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలతో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమానికి జనసేన శ్రేణులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అవసరమైతే ఒంటరిగానే బరిలోకి దిగుతామని పవన్ కల్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. పార్టీలోకి చేరికలను ప్రోత్సహించేందుకు వీలుగా త్వరలోనే ఒక ప్రత్యేక జాయినింగ్స్ కమిటీని కూడా నియమించనున్నారు.

## కోల్‌కతా వెళ్లిన నారా లోకేశ్... సీఎం సువేందు అధికారితో కీలక భేటీ

ఈ సమావేశంలో మంత్రి లోకేశ్.. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న పాలనా విధానాలను సువేందు అధికారికి వివరించారు. టెక్నాలజీని ఉపయోగించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్న తీరును, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్న వైనాన్ని తెలియజేశారు. డిజిటల్ గవర్నెన్స్, రియల్ టైమ్ మానిటరింగ్ ద్వారా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్లు పేర్కొన్నారు.

అదే సమయంలో, పశ్చిమ బెంగాల్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆలయ నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయించాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. తిరుమలలో 'పశ్చిమ బెంగాల్ భవన్' నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. మత్స్య సంపద పెంపు, ఎగుమతుల విషయంలో రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటే మరింత అభివృద్ధి సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. మంత్రి లోకేశ్ చేసిన ప్రతిపాదనలపై సీఎం సువేందు అధికారి సానుకూలంగా స్పందించారు.

కాగా, లోకేశ్ రేపు కోల్ కతాలో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐ.సి.సి) ఆధ్వర్యంలో జరిగే ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలు అనే సదస్సులో పాల్గొంటారు.

## చంద్రబాబు, నిమ్మగడ్డ రమేశ్ పై అనుచిత వ్యాఖ్యలు.. కొడాలి నానిపై విచారణకు ఏపీ ప్రభుత్వం అనుమతి

దారుణమైన వ్యాఖ్యల కేసులో.. ఆయనపై క్రిమినల్ విచారణ జరిపేందుకు ఏపీ ప్రభుత్వం అధికారికంగా అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పూర్తి వివరాల్లోకి వెళితే... 2021 ఫిబ్రవరిలో ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా కోడ్ అమల్లో ఉంది. ఆ సమయంలో పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్న కొడాలి నాని ప్రెస్‌మీట్ పెట్టి... "చంద్రబాబును మెడపట్టి ఈ రాష్ట్రం నుంచి వెళ్లగొట్టాలి" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతటితో ఆగకుండా, అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కు కూడా దురుద్దేశాలు ఆపాదిస్తూ దూషణలకు దిగారు.

ఈ వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దారుణంగా ఉల్లంఘించడమేనని నాటి ఎస్ఈసీ సంయుక్త కార్యదర్శి కృష్ణా జిల్లా ఎస్పీకి రిపోర్ట్ ఇచ్చారు. దీంతో గుడివాడ పోలీసులు స్థానిక కోర్టు అనుమతి తీసుకుని 2021 ఫిబ్రవరి 16న కొడాలి నానిపై ఐపీసీలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

చట్టం ప్రకారం ఎవరైనా ఒక వ్యక్తి మంత్రి పదవిలో ఉన్నప్పుడు... ఆయనపై నమోదైన క్రిమినల్ కేసును కోర్టు విచారణకు స్వీకరించాలన్నా, పోలీసులు ఛార్జ్‌షీట్ వేయాలన్నా ప్రభుత్వం నుంచి కచ్చితంగా ప్రాసిక్యూషన్ అనుమతి తీసుకోవాలి. గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వమే అధికారంలో ఉండటంతో కొడాలి నానిపై ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వకుండా ఆ ఫైల్‌ను తొక్కిపెట్టారు.

ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చాక పాత కేసుల ఫైళ్లు కదిలాయి. కృష్ణా జిల్లా కలెక్టర్ నుంచి వచ్చిన ప్రతిపాదనలను నిశితంగా పరిశీలించిన హోంశాఖ... కొడాలి నానిపై చర్యలు తీసుకునేందుకు ప్రాథమిక ఆధారాలు బలంగా ఉన్నాయని నిర్ధారించింది. ఈ మేరకు కోర్టులో విచారణ వేగవంతం చేసేందుకు వీలుగా కొడాలి నాని ప్రాసిక్యూషన్‌కు అనుమతినిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.

## కోల్‌కతాలో పారిశ్రామిక దిగ్గజాలతో నారా లోకేశ్ వరుస భేటీలు

భవిష్యత్ సాంకేతికత, హరిత ఇంధనంపై దృష్టి

హిమాద్రి స్పెషాలిటీ కెమికల్స్ సీఎండీ అనురాగ్ చౌదరితో భేటీ అయిన మంత్రి లోకేశ్, రాష్ట్రంలో సిలికాన్-కార్బన్ యానోడ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. "దక్షిణ భారతదేశ ఈవీ తయారీ కారిడార్‌కు ఏపీని కీలక సరఫరాదారుగా మార్చాలన్నది మా సంకల్పం. నెల్లూరు లేదా చిత్తూరు ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్లలో మీ యూనిట్ ఏర్పాటు చేయండి" అని లోకేశ్ ప్రతిపాదించారు. దీనితో పాటు, ఐఐటీ తిరుపతి లేదా ఆంధ్రా యూనివర్సిటీ భాగస్వామ్యంతో అమరావతిలో ఒక అధునాతన మెటీరియల్ ల్యాబ్‌ను స్థాపించాలని సూచించారు.

అలాగే, విక్రమ్ సోలార్ ఛైర్మన్ జ్ఞానేష్ చౌదరి, సీఈఓ అరుణ్ మిట్టల్‌తో సమావేశమై రాయలసీమలో ఇంటిగ్రేటెడ్ సోలార్ హబ్ ఏర్పాటు చేయాలని లోకేశ్ కోరారు. "రాబోయే ఐదేళ్లలో 78.5 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించడం, రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, 7.5 లక్షల ఉద్యోగాలు సృష్టించడం మా ధ్యేయం" అని ఆయన వివరించారు. రిలయన్స్, ఎస్ఏఈఎల్ వంటి సంస్థలు ఇప్పటికే రాయలసీమలో భారీ సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

ఉక్కు, అల్యూమినియం పరిశ్రమలకు ఆహ్వానం

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన, రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభం నేపథ్యంలో ఉక్కు, నిర్మాణ సామగ్రికి భారీ డిమాండ్ ఏర్పడిందని లోకేశ్ తెలిపారు. శ్యామ్ మెటాలిక్స్, సూపర్ స్మెల్టర్స్, రష్మీ మెటాలిక్స్ సంస్థల ప్రతినిధులతో వేర్వేరుగా సమావేశమై, ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలను వివరించారు. కృష్ణపట్నం, గంగవరం, విశాఖ ఓడరేవులు, పారిశ్రామిక కారిడార్లలో ఉన్న అనుకూలతలను ఆయన గుర్తుచేశారు.

శ్యామ్ మెటాలిక్స్ సంస్థ ఈవీ-గ్రేడ్ అల్యూమినియం తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, సూపర్ స్మెల్టర్స్ సంస్థ విజయనగరంలో ఏర్పాటు చేయనున్న స్టీల్ ప్లాంట్ సామర్థ్యాన్ని 2 ఎంటీపీఏకు విస్తరించాలని కోరారు. కార్మికుల నైపుణ్యాభివృద్ధికి ఒక ప్రత్యేక శిక్షణా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. రష్మీ మెటాలిక్స్ సంస్థ విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ సమీపంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్, డక్టైల్ ఐరన్ పైపుల తయారీ ప్లాంట్‌ను నెలకొల్పాలని ప్రతిపాదించారు.

ఆగ్రో, హాస్పిటాలిటీ రంగాలపై ఐటీసీకి ప్రతిపాదనలు

ప్రముఖ సంస్థ ఐటీసీ ఛైర్మన్ సంజీవ్ పూరితో భేటీ అయిన లోకేశ్, రాష్ట్రంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, హాస్పిటాలిటీ రంగాలపై దృష్టి సారించాలని కోరారు.

"ఆంధ్రప్రదేశ్‌తో కలిసి క్రాప్ వాల్యూ చైన్ క్లస్టర్లలో పెట్టుబడులు పెట్టాలి. వాతావరణ మార్పులను తట్టుకునే వంగడాల సృష్టిలో మాతో కలిసి పనిచేయాలి" అని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సంజీవ్ పూరి, ఏపీలో తమ సంస్థకు ఇప్పటికే బలమైన కార్యకలాపాలు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన కంపెనీల ప్రతినిధులు కూడా ప్రభుత్వ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని మంత్రి లోకేశ్ కు తెలిపారు.

# శ్రీ మందేశ్వర స్వామి ఆలయానికి రూ.3 లక్షల విరాళం...

## స్టీల్ క్యూలైన్స్ ఏర్పాటుకు విరాళాన్ని అందించిన దాతలు గ్రంధి రాజేష్ దంపతులు..

రావులపాలెం ,(కింగ్ )



మందపల్లి శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం స్టీల్ క్యూలైన్స్ ఏర్పాటు చేయడానికి గ్రంధి రాజేష్, రమా దంపతులు, వీ/ం ఇషి స్టీల్ రిసోర్సెస్ ఎల్ఎల్పి వారు రూ.3,00,000/-లను విరాళంగా అందించడం ఎంతో సంతోషకరం అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని ఆలయ అధికారులకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతులు మీదగా దాతలు అందజేయడం అభినందనీయమన్నారు.దేవస్థానం అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ఈ విరాళం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. దాతృత్వం చూపిన గ్రంధి రాజేష్, రమా దంపతులకు మరియు సంబంధిత సంస్థ ప్రతినిధులకు ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెంతో మందికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

# యువతకు తొలి ఉద్యోగం... ఆర్థిక భరోసాతో ఉజ్వల భవిష్యత్

## - మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం, ,(కింగ్ )



ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ద్వారా యువతకు ఉపాధి ▪ వికసిత్ భారత లక్ష్య సాధనకు బాటలు భారత ప్రభుత్వం కార్మిక & ఉపాధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, జూఖీూ ప్రాంతీయ కార్యాలయం రాజమహేంద్రవరం నిర్వహించిన "ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన" లబ్ధిదారులకు ప్రోత్సాహక నిధుల పంపిణీ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక & సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. రాజమహేంద్రవరం దివాన్ చెరువు వద్దనున్న ా్ఖుూజ కన్వెన్షన్స్ హాల్లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వర్చువల్‌గా దేశవ్యాప్తంగా లబ్ధిదారులకు ప్రోత్సాహక నిధులను విడుదల చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, దేశ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, తొలి ఉద్యోగం పొందిన యువతకు ప్రభుత్వం ప్రత్యక్ష ప్రోత్సాహం అందించడం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నదన్నారు

# గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో నిడదవోలు భ్రామరీ కూచిపూడి నాట్య నిలయం విద్యార్థుల ప్రభంజనం

## మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు



రాజమహేంద్రవరం/నిడదవోలు ,(కింగ్ )

హైదరాబాద్‌లో భారత్ ఆర్ట్స్ అకాడమీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన "అతిపెద్ద కూచిపూడి నృత్య ప్రదర్శన" గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ కార్యక్రమంలో నిడదవోలుకు చెందిన భ్రామరీ కూచిపూడి నాట్య నిలయం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. మొత్తం 4,530 మంది కళాకారులతో నిర్వహించిన ఈ మహా నృత్య యజ్ఞంలో ఈ సంస్థకు చెందిన 25 మంది విద్యార్థులు పాల్గొని, రికార్డు సాధనలో భాగస్వాములై ప్రతిష్టాత్మక టైటిల్‌ను కైవసం చేసుకున్నారు.

ఈ అద్భుత విజయాన్ని సాధించిన విద్యార్థులు, వారి గురువులు రాజమహేంద్రవరంలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మరియు శిక్షకులను ప్రత్యేకంగా అభినందించారు.

అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ. "నిడదవోలు భ్రామరీ కూచిపూడి నాట్య నిలయం విద్యార్థులు ఇంతటి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చుకోవడం మన ప్రాంతానికే కాకుండా, మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణం. ఇంత చిన్న వయసులోనే మన సాంప్రదాయ నృత్యమైన కూచిపూడిలో శిక్షణ పొంది, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వంటి ఒక చారిత్రాత్మక మైలురాయిలో భాగస్వాములు కావడం అభినందనీయం. యువ కళాకారులకు, మన సంస్కృతి సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లే ఇలాంటి సంస్థలకు ప్రభుత్వం తరపున ఎల్లప్పుడూ పూర్తి ప్రోత్సాహం ఉంటుంది," అని మంత్రి కొనియాడారు.

# సమంతపై రామ్ చరణ్ ప్రశంసలు.. అసాధారణ ధైర్యశాలి అంటూ ట్వీట్



'మా ఇంటి బంగారం' విడుదల సందర్భంగా సమంతపై రామ్ చరణ్ ప్రశంసలు

సమంత అసాధారణ ధైర్యం, శక్తిగల మహిళ అని కొనియాడిన చరణ్

చిత్ర బృందానికి, సమంతకు శుభాకాంక్షలు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్ట్

చరణ్ ప్రశంసలు ఎంతో విలువైవని సమంత బదులు

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రముఖ నటి సమంతపై ప్రశంసల వర్షం కురిపించారు. నేడు విడుదలైన సమంత తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' నేపథ్యంలో ఆమెను 'అసాధారణ ధైర్యవంతురాలు' అంటూ కొనియాడారు. ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి సానుకూల స్పందన లభిస్తున్న తరుణంలో చరణ్ చేసిన అభినందనలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ఈ సందర్భంగా రామ్ చరణ్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "ప్రియమైన సమంత, మీరు ఎల్లప్పుడూ అసాధారణమైన శక్తి, సౌందర్యం మరియు ఆత్మవిశ్వాసం కలిగిన మహిళ" అని పేర్కొన్నారు. ""మా ఇంటి బంగారం' సినిమా గురించి అద్భుతమైన విషయాలు వింటున్నాను. ఈ విజయాన్ని అందుకున్న మీకు, చిత్ర బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. మీ అందరి విజయం పట్ల నేను ఎంతో సంతోషిస్తున్నాను" అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

రామ్ చరణ్ ప్రశంసలపై సమంత స్పందిస్తూ, ఈ మాటలు తనకు, తన చిత్ర బృందానికి ఎంతో విలువైనవని బదులిచ్చారు.

నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సమంత స్వయంగా నిర్మించడం విశేషం. ఇందులో వాస్తవిక యాక్షన్ సన్నివేశాల్లో ఆమె డూప్ లేకుండా నటించి మెప్పించారు. మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధితో పోరాడి, కొంతకాలం సినిమాలకు విరామం తీసుకున్న తర్వాత సమంత వరుసగా సినిమాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, 'మా ఇంటి బంగారం'పై ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది.

# అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

## జిల్లా అధికారుల సమీక్ష సమావేశంలో మంత్రి నాయుడు

అమలాపురం ,(కింగ్ )




ప్రతి అసెంబ్లీ నియోజకవ ర్గంలో కనీసం ఒక రైతు బజార్ ఏర్పాటు చేయా లన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్దేశ్యమని ప్రతి నియోజకవర్గంలో సుమారు 20 నుండి 30 సెంట్ల స్థలాలను సేకరించాలని జిల్లా ఇన్చార్జి ,వ్యవసాయ ఉద్యాన మార్కెటింగ్ సహకార ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు మత్స్యశాఖల మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. సముద్ర తీర ప్రాంతాల ఆర్థికాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ చేయమంటూ జిల్లా ఇన్- ఛార్జ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్ర వారం జిల్లా సమీక్ష కమిటీ సమావేశం లో వివిధ శాఖల ప్రగతిపై విస్తృత సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన ప్రసం గిస్తూ ప్రజాప్రతినిధు లు, అధికారులు సమన్వ యంతో పనిచేసి కోనసీమ జిల్లాను ప్రగతి పథంలో నిలపాలని పనుల్లో నిర్ల క్ష్యంవహిస్తే సహించేది లేదని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను హెచ్చరించారు. రైతాం గానికి సకాలంలో ఇన్‌పు ట్స్, అందించి డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటుగా ఁసముద్రపు నాచు, పీతల పెంపకంతో మత్స్య కారుల డ్వాక్రా సంఘ మహిళల జీవనోపాధి కి పెద్దపీట వేయాలన్నారు. ఖరీఫ్ సీజన్ సజావుగా జరిగేందుకు ఒక్కొక్క నియోజకవర్గానికి సుమారు మూడున్నర కోట్లు కాలువలు పూడికతీత పనులకు కేటాయించడం జరిగిందని, ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఆధునీకరణకు రాష్ట్ర ముఖ్యమంత్రి లైడర్ సర్వేకు ఆదేశించడం జరిగిందని నివేదిక వచ్చిన పిదప గోదావరి డెల్టా ఆధునీకరణకు నిధులు కేటాయించి చర్యలు చేపట్టను న్నట్లు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో విత్తనాలు సరఫరా చేయడం జరిగిందని, ఎరువులు శాస్త్రజ్ఞులు సిఫార్సు చేసిన మేరకే సరఫరా చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఒక యాప్ ను రూపొందించిందని ఆ ప్రకారం సరఫరా జరుగు తుందని వెల్లడించారు .యూరియా వ్యవసాయేతర రంగాలకు వ్యవసాయానికి కూడా విపరీతంగా వాడటం పట్ల భూసారం కోల్పోవడంతో పాటుగా క్యాన్సర్ వంటి వ్యాధులు, యూరియా ద్వారా ఉత్పత్తి అయిన ఉ త్ప త్తులలో పురుగుమందు అవశేషాల పెరగడం మూలంగా విదేశాలకు వెళ్లిన ఉత్పత్తులు తిరిగి స్వదేశానికి తిరిగి పశీపేస్తు న్నారని కావున శాస్త్రజ్ఞుల సిఫార్సులను రైతాంగం తప్పనిసరిగా ఆచరించాలని సూచించారు. రైతాంగం ఎరువుల సరఫరా పట్ల ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, శాస్త్రజ్ఞుల సిఫార్సులకు అనుగుణం గా ఎరువులు రాష్ట్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. కౌలుదారులు, దేవాలయ ధర్మాదాయ శాఖ భూములలో వ్యవసాయం చేస్తున్న రైతులు కూడా ఈ యాప్ ద్వారా ఎరువులు పొంద వచ్చునన్నారు. ఈ యాప్ వినియోగం మూలంగా భవిష్యత్తులో ఎరువుల సరఫరాలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావని, అదేవిధంగా నాణ్యమైన ఉత్పత్తుల తయారీకి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఎరువుల సరఫరా క్రమబద్ధీకరణకు ఈ యాప్ దోహ దపడుతుందన్నారు ప్రతి విషయాన్ని సీరియస్గా తీసుకొని బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులను తీసుకొని రావాలన్నారు.ప్రధానంగా ప్రతి శాఖలో ప్రస్తుతం ఉన్న సంతృప్తి స్థాయిలను బేరీజుగా తీసుకొని సంతృప్తి స్థాయి లు పెంచాల్సిన ఆవశ్యకత పై అధికారులకు దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు.ముఖ్యమంత్రి ప్రతివారం ప్రతి శాఖ పనితీరుపై సంతృప్తి స్థాయిలను స్వయంగా సాంకేతికతను జోడించి తెలుసుకుంటూ రాష్ట్ర స్థాయిలో అధికారులకు సూచించడం జరుగుతుం దని అదేవిధంగా క్షేత్రస్థా యిలో కూడా ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయ లోపాలకు తావు లేకుండా ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించాలని ఆయన స్పష్టం చేశారు . ప్రస్తుత సమీక్షలో సమన్వయ లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఇకపై క్రమం తప్పకుండా మూడు మాసాలకు ఒకసారి డిఆర్సి మీటింగ్లు నిర్వహించడం జరుగు తుందన్నారు. కోనసీమ జిల్లాలో బ్లాక్ సాయిల్ మూలంగా రోడ్లు ప్రతి ఏడాది దెబ్బతింటున్నా యని శాశ్వత ప్రాతిపదికన సిసి రోడ్లుగా నిర్మించేందు కు ముఖ్యమంత్రి కార్యాచ రణ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఆక్వారంగానికి రాయితీపై రూ.1.50 పైసలకే చార్జీలు ప్రకటించి న ఘనత తమ ప్రభుత్వా నికే దక్కుతుందన్నారు. రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా ఆక్వారంగా నిలిచిందని, ఆక్వా రంగ అభివృద్ధికి ఫీడు, ధరల నియం త్రణకు కమిటీని నియమిం చడం జరిగిందని తెలిపారు. అక్వారంగాన్ని అన్ని విధాలుగా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఏపీ ఈపీడీసీఎల్ సమావేశాన్ని సీఎండీతో స్థానికంగా నిర్వహించి విద్యుత్ లో వోల్టేజ్ సమస్యలను సరఫరాలో అంతరాయా లు తొలగించేందుకు త్రీఫేస్ విద్యుత్ వ్యవస్థను జిల్లా అంతటా తీసుకువచ్చేం దుకు రూ 3.20 కోట్లతో ప్రతిపాదన సిద్ధం చేసినట్టు తెలిపారు. పలువురు శాసనసభ్యులు ప్రసంగిస్తూ అధికారులు ప్రజాప్డ

# లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి 'సీఎంఆర్ఎఫ్' చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గణబాబు

విశాఖపట్నం ,(కింగ్ )



విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ గణబాబు నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) చెక్కులను వారి ఇంటి వద్దకే వెళ్లి స్వయంగా అందజేశారు. 92వ వార్డు ఇందిరానగర్ పరిధిలో శనివారం ఆయన పర్యటించి, అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నలుగురు లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 2,63,156 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భం గా ఎమ్మెల్యే గణబాబు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, చెక్కులను అందజేయడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య సేవల గురించి ఆత్మీయంగా అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడకుండా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వారికి ధైర్యం చెప్పారు

# వ్యవసాయ శాఖ- ఆత్మ సౌజన్యంతో డిజిటలీకరణ. ఏవో. అనురాధ పండా.



## ఏపీ ఎయిమ్స్ 2.0. యాప్ ద్వారా మాత్రమే రైతులు యూరియా పొందవచ్చును. ఏఎంసీ. చైర్మన్. సూర్యనారాయణ.

సాలూరు. ,(కింగ్ )

పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలంలో గల గురువు నాయుడుపేట రైతు సేవా కేంద్రం పరిధిలో శుక్రవారం గొలుగువలస గ్రామంలో వ్యవసాయ శాఖ- ఆత్మ సౌజన్యంతో వ్యవసాయ శాఖ సేవల డిజిటలీకరణలో ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ పై రైతులందరికీ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్.ముఖి.సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రైతులను ఉద్దేశించిహా ఖరీఫ్ సీజన్లో పంటలపై ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు తెలియజేయడమైనది. అలాగే ఈ సీజన్ కి సంబంధించి ఎరువులను ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ ద్వారా మాత్రమే సరఫరా చేయబడుతుందని వివరించారు.రైతు సేవావకేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ ద్వారా మాత్రమే ఎరువులను ఇవ్వాలని సూచించారు. ఈ అప్లికేషన్లో మండలంలో ఉన్న ప్రతి రైతు సేవ కేంద్రంలో గ్రామ వ్యవసాయ నాయకులు, మండలంలో ఉన్న అన్ని రిటైలర్ ఎరువుల షాపులను మ్యాపింగ్ చేయడం జరిగింది. మన మండలంతో పాటుగా పక్క మండలమైన సాలూరులో ఉన్న రిటైలర్ షాపులను మ్యాపింగ్ చేయడం కూడా జరిగింది. మండలంలో ఉన్న ప్రతి ఒక్కరైతు తమ గ్రామాల్లోని రైతుసేవ కేంద్రాల్లోని రైతుల ఈ పంట వివరాలను తనిఖీ చేయాలని కోరారు .పట్టాదార్ రైతులు, కౌలు రైతులు, డిపట్టా రైతులు, అందరూ కూడా ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ ద్వారా మాత్రమే యూరియా పొందగలరని కోరడమైనది. ఒకవేళ ఆర్ఎస్కే లో రైతులు వివరాలు లేనియెడల సదరు రైతు వ్యవసాయ అధికారి వద్ద తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. గ్రామంలో పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు ఈ క్రాప్ యాప్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులు ఎవరైనా ఉంటే సమీప రైతు సేవ కేంద్రంలో కౌలు కార్డులు చేయించుకోవాలని తెలియజేశారు. కౌలు కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.మరి ముఖ్యంగా రైతులందరూ సహజ పద్ధతుల్లో ప్రకృతి వ్యవసాయం వైపు మారాలని సూచించారు. తమ పొలాల్లో నవధాన్యాలు, పచ్చి రొట్టె ఎరువులు వేయాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి. అనురాధ పండా రైతులకు పిఎండిఎస్ నవధాన్య కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు కోరిపల్లి సురేష్ కుమార్. గ్రామ వ్యవసాయ సహాయకులు టి. అనిల్ కుమార్ మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన్ ప్రభాకర్ రావు నేతృత్వంలో రాహుల్ గాంధీ 56 వ పుట్టిన రోజు వేడుకలు....



మండపేట ,(కింగ్ )

అఖిలభారత కాంగ్రెస్ పార్టీ నాయకులు, లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ 56 జన్మదినోత్సవం వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన్ ప్రభాకర్ రావు నేతృత్వంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామన కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యకర్తలు అందరికీ కేక్ తో పాటు మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కామన మాట్లాడుతూ రెండు పర్యాయాలు 2004, 2009 లలో ఈ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టే అవకాశం వచ్చినా తృణపాయంగా దేశ ప్రధాని పదవి తిరస్కరించిన గొప్ప నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. తన నానమ్మ ఇందిరా గాంధీ తండ్రి రాజీవ్ గాంధీ ప్రాణత్యాగం చేసిన గొప్ప ప్రధానులని కొనియాడారు. రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు భారత్ జోడో పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. ఈశాన్య రాష్ట్రాల నుండి ఢిల్లీ వరకు న్యాయపోరాటం చేశారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని పార్లమెంట్ లో తన గళాన్ని వినిపిస్తున్నారని పేర్కొన్నారు.

# జాన్వీక్ ఆర్యన్ తొలి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర.

సాలూరు ,(కింగ్ )





పాచిపెంట మండలం. పి. కొనవలస పంచాయతీ చెరుకుపల్లి గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ కొరటాన. అప్పారావు. మనవడు చి" జాన్వీక్ ఆర్యన్ తొలి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ డిప్యూటీ సీఎం,మాజీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి. పీడిక. రాజన్నదొర చిన్నారి జాన్వీక్ ఆర్యన్ను ఆశీర్వదించి,ఆయురారోగ్యాలతో,విద్యా విజయాలతో జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు మాజీ సర్పంచ్. జమ్ము అప్పారావు. మాజీ. పిఏసిఎస్.డైరెక్టర్ జయమ్మ. వైసీపీ నాయకులు, జి. తిరుపతి రావు.చంటి. జి. సూర్యనారాయణ.దేవుడు. మరియు ,బంధుమిత్రులు, గ్రామ పెద్దలు పాల్గొని ఆర్యన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఉన్నత శిఖరాలకు చేర్చే ఆయుధం విద్య: గంటా

విశాఖపట్నం ,(కింగ్ )

.ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి చదువు ఒక్కటే బలమైన ఆయుధమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం భీమిలి కేజీబీవీ సందర్శించిన ఆయన ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను అభినందిస్తూ భవిష్యత్ లక్ష్యాన్ని హైస్కూల్ దశలోనే నిర్దేశించుకుని దానికి తగ్గట్టుగా శ్రమించాలన్నారు. వర్షపు చినుకుల్లాంటి విద్యార్థులు అల్చిప్ప లాంటి ఉత్తమ విద్యాసంస్థలు, టీచర్ల చెంతన చేరితే ముత్యాలుగా మారతారని చెప్పారు. కొత్త తరగతి గదులను త్వరలో ప్రారంభిస్తామని, ప్రహరీగోడ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మంచి ఫలితాలు సాధించిన కేజీబీవీ టీచర్లకు, విద్యార్థినులకు గంటా అభినందనలు తెలియజేశారు. ఇంటర్ లో ఎక్కువ మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థినులు మాట్లాడుతూ భవిష్యత్ లో తాము జిల్లా కలెక్టర్, డాక్టర్ అవుతామన్నారు. విద్యార్థినులకు గంటా స్కూల్ యూనిఫారాల సహా బ్యాగులు, పుస్తకాలు, బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీడీ చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, ఎమ్మార్వో పి.రామారావు, ప్రిన్సిపాల్ గంగా భవాని, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పుడు, గంటా నూకరాజు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, గొలగాని నరేంద్ర, కనకల అప్పలనాయుడు, చురకల రమణ, కె.రామానాయుడు,




# కాపు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

## -కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు....

రావులపాలెం ,(కింగ్ )



అంబేద్కర్ కొనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెంలోని గోపాలపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు, కాపు ఉద్యమ నేత ఆకుల రామకృష్ణను కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాపు జేఏసీ నాయకులతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాపు కార్పొరేషన్ ద్వారా కాపు, తెలగ, బలిజ వర్గాలకు అందాల్సిన రుణాలు, కాపు రిజర్వేషన్లు మరియు రాష్ట్రవ్యాప్తంగా కాపు సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

అనంతరం సమావేశం లో మాట్లాడిన కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో కాపు, తెలగ, బలిజ వర్గాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాపు కార్పొరేషన్ రుణాల మంజూరుకు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నప్పటికీ, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని గాడిలో పెట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశగా ముందుకు సాగుతోందని, అదే క్రమంలో కాపు కార్పొరేషన్ రుణాల పంపిణీలో జరిగిన ఆలస్యాన్ని త్వరలో అధిగమించి లబ్ధిదారులకు రుణాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కాపు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ ఆకుల రామకృష్ణ, జేఏసీ నాయకులతో కలిసి కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడికి వినతిపత్రం అందజేశారు.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల సూపరి పాలన

# విజయోత్సవ సభలో మంత్రులు

## అచ్చెన్నాయుడు, వాసంశెట్టి సుభాష్

అమలాపురం: ,(కింగ్ )

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల సుపరిపాలన విజయోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ప్రతి వర్గానికి సమన్యాయం చేస్తూ పాలన సాగిస్తున్నామన్నారు.





వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. "అన్నదాత సుఖీభవ" పథకం ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు.

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన సొమ్మును 24 గంటల్లోనే వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేయడానికి ఇంటి వద్దకే పశువైద్య సేవలు, పశుగ్రాసం, పశుదాణా అందిస్తున్నామని చెప్పారు. గ్రామీణ రహదారులు, తాగునీటి పథకాలు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యా మరియు వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల గుండెల్లో శాశ్వతం : మంత్రి సుభాష్

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ మహిళా సాధికారికత, ఉపాధి కల్పనా దిశగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రెండేళ్లలో రాష్ట్రానికి వెల్లువలా పెట్టుబడులు వస్తున్నాయని, వీటి ద్వారా సుమారు 23 లక్షల ఉద్యోగాలు కల్పనకు సర్వం సిద్ధం అయిందన్నారు. రానున్న మూడు సంవత్సరాల్లో మరో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి జరుగుతుందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద రెండో ఇన్వెస్ట్మెంట్ సంస్థ గూగుల్ కూడా విశాఖపట్నంలో స్థాపించడం పట్ల ప్రపంచ దేశాలన్నీ మన రాష్ట్రం వైపు చూస్తున్నాయన్నారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత వైసీపీ పాలనలో ఆర్థికంగా తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం తిరిగి గాడిలో పెట్టిందన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ అందించి నేడు అన్ని రంగాల్లో పురోగతి సాధించేలా చేశామన్నారు.

ఆర్థిక సంక్షోభం నుంచి అభివృద్ధి పథంలో రాష్ట్రం ముందుకు సాగుతుందన్నారు.

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసి అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అయితే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని తెలిపారు.

# 90 లక్షల బిటి రోడ్ అభివృద్ధికి శంకుస్థాపన

## అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి



అనపర్తి ,(కింగ్ )

అనపర్తి మండలం కుతుకులూరు నుండి సీతంపేట (సోమేశ్వరం) వరకు 90 లక్షల రూపాయలతో నిర్మిశీచబోయే బిటి రోడ్ అభివృద్ధికి శంకుస్థాపన చేసిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో అధికారులు,అనపర్తి నియోజకవర్గం,అనపర్తి మండలం,కుతుకులూరు గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ద్వారకా తిరుమలలో (మోహన్ ధామ భవనం) ఎల్వి ప్రసాద్ ప్రాథమిక నేత్ర ఆసుపత్రి ప్రారంభం:

ద్వారకా తిరుమల, ,(కింగ్ )

గ్రామీణ ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ద్వారకా తిరుమల గ్రామంలో నూతన ప్రాథమిక నేత్ర ఆసుపత్రి గుప్త ఫౌండేషన్ చైర్మన్ గుప్త ఘనంగా ప్రారంభమైంది. మోహన్ ధామ భవనంలో కంటి పరీక్షలు, సాధారణ నేత్ర చికిత్సలు, కంటి వ్యాధుల నిర్ధారణతో పాటు అవసరమైన వారికి నిపుణుల సలహాలు అందించబడనున్నాయి. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ,గుప్త ఫౌండేషన్ చైర్మన్ గుప్త మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు కంటి సంబంధిత చికిత్సల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని, ఆసుపత్రి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుప్త ఫౌండే చైర్మన్ గుప్త ఐవి ఆర్ సుధాకరడాక్టార్ భవ్య చాంద్ నారాయణ మూర్తి మరియు వంశీ గారఎల్ వీ ప్రసాద్ కంటి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.




# జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో పలు సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అమలాపురం ,(కింగ్ )

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని గోదావరి భవన్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో జిల్లా సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గిడ్డి సత్యనారాయణ గారు మాట్లాడుతూ పలు శాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. విద్యుత్ శాఖ సమీక్ష సందర్భంగా పి.గన్నవరం నియోజకవర్గంలో లైన్‌మెన్‌ల కొరత తీవ్రంగా ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయడం ద్వారా విద్యుత్ సేవలను మరింత మెరుగుపరచాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశంలో ఆశా వర్కర్లకు ఎంపిక విషయంలో డిఎంహెచ్ఓ గారు సరిగ్గా పనిచేయలేదని ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని వారిపై విచారించే చర్యలు తీసుకోవాలని మంత్రి. గారిని కోరడం జరిగింది అదేవిధంగా మామిడికుదురు మండలం పాసర్లపూడి లంక గ్రామంలో డ్రైనేజీ సమస్యల కారణంగా సుమారు 500 కొబ్బరి చెట్లు దెబ్బతిన్న విషయాన్ని సమావేశంలో ప్రస్తావించారు. నష్టపోయిన రైతులకు ఊరట కల్పించే విధంగా దెబ్బతిన్న చెట్ల స్థానంలో కొత్త కొబ్బరి మొక్కలను అందించే చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు గారిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రివర్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.







# ప్రత్యేక పీజీఆర్ఎస్ ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

## అనపర్తి నియోజకవర్గంలో 84 అర్జీల స్వీకరణ

## - జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

అనపర్తి ,(కింగ్ )

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నాలుగు వారాల పాటు ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (గ్రా+=గా) నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం అనపర్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (వీూణూ) కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక పీజీఆర్ఎస్‌లో స్థానిక శాసనసభ్యుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్‌తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, ఈరోజు మొత్తం 84 అర్జీలు స్వీకరించామని తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో తొలిసారిగా కొవ్వూరు నియోజకవర్గంలో ప్రత్యేక పీజీఆర్ఎస్ నిర్వహించగా, రెండో కార్యక్రమాన్ని అనపర్తి నియోజకవర్గంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇంకా మూడు శుక్రవారాలు ఇదే నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక పీజీఆర్ఎస్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని చెప్పారు. రెవెన్యూ, తాగునీరు, పెన్షన్లు, మౌలిక సదుపాయాలు తదితర సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కారం చూపిస్తామని, పరిష్కారం సాధ్యం కాని అంశాలపై కూడా కారణాలను స్పష్టంగా తెలియజేస్తామని పేర్కొన్నారు. అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రజల వద్దకే అధికారులు వచ్చి అర్జీలు స్వీకరించడం, అక్కడికక్కడే పరిష్కార మార్గాలపై చర్యలు ప్రారంభించడం ఈ ప్రత్యేక పీజీఆర్ఎస్ ముఖ్య ఉద్దేశమన్నారు. అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాలుగు వారాల పాటు జరిగే ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే లక్ష్యమని తెలిపారు.




స్వీకరించిన కొన్ని అర్జీలు:

కాపవరం గ్రామానికి చెందిన మరక అశోక్ తమ వీధిలో డ్రైనేజీ కాలువలు సరిగా లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కాలువ వెడల్పు చేసి సమస్య పరిష్కరించాలని అర్జీ సమర్పించారు. రంగంపేటకు చెందిన దూబాసి వరప్రసాద్ ఎస్సీ కాలనీలో తాగునీటి కొరత ఉందని కొత్త బోరు ఏర్పాటు చేయాలని కోరగా, సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ధరణికోటకు చెందిన మందనక్క నళినీ ప్రియ తన భర్త 2021లో మరణించారని, వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరగా, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌కు పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. రంగంపేట మండలం వడిసిలేరు గ్రామపంచాయతీ పరిధిలోని కృష్ణ లూబ్రికెంట్స్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న పొగ, దుర్వాసన వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని పెండ్యాల వీర వెంకట సత్యనారాయణ అర్జీ సమర్పించారు. అనపర్తికి చెందిన నీలం కీర్తన తనకు ఒంటరి మహిళ పెన్షన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించగా, సంబంధిత అధికారులకు పరిశీలించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, ఆర్‌డీఓ ఆర్. శివరాముడు, తహసీల్దార్లు అనిల్ కుమార్, పాపారావు, రమాదేవి, ఎంపీడీవోలు ఎం. రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్, సాయిబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ పుట్టిన రోజున మొక్క నాటిన..

## కిసాన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగం రామకృష్ణారెడ్డి.

## ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీ కావాలని కోరుకున్న నాయకులు.

మదనపల్లి ,(కింగ్ )

రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సింగం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఒక మొక్కను నాటారు. శుక్రవారం రాహుల్ గాంధీ 55వ జన్మదినాన్ని పురస్కరించుకొని సింగం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటి, నీరు పోశారు. సిటిఎం- వాయల్పాడు రహదారిలో సింగం రామకృష్ణారెడ్డి నాటిన మొక్కకు కాంగ్రెస్ పార్టీ నాయకులు నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ భావి ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీ అవుతున్నారని తెలిపారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా భారత దేశంలోని ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఒక పండగ అని తెలిపారు. గత 12 ఏళ్లుగా నిరంకుశంగా పరిపాలిస్తున్న మోడీ ప్రభుత్వానికి రాహుల్ గాంధీ అన్ని విధాలుగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిలమ్మ, కిసాన్ కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు నీలం రమేష్ ఆధ్వర్యంలో నిత్యం అనేక ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నట్లు సింగం రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.





# రాష్ట్రంలో దళితులకు రక్షణ లేదు

**మాదిగ యువకుడు పేరు పోగు క్రాంతి కుమార్ మరణం పై సమగ్ర విచారణ జరిపించాలి!**

**వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యవర్గ సభ్యులు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కోరిశెట్టి మాల మధుబాబు**

ఎమ్మిగనూరు ,(కింగ్ )

రాష్ట్రంలో దళితులపై హత్యలు, అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలు రోజురోజుకు పెరిగిపోయి దళితుల పై రెడ్ బుక్ రాజ్యాంగం అమలు అవుతుండడంతో పూర్తిగా రక్షణ కరువైందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కర్నూలు జిల్లా కార్యవర్గ సభ్యులు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కోరిశెట్టి మాల మధుబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత నాయకుల హత్యలు పరంపరంగా కొనసాగడం విచారకరమన్నారు. విజయవాడ,కృష్ణలంక పోలీసులు వేధింపుల వల్ల దళిత యువకుడు క్రాంతి కుమార్ ఆత్మహత్య చేసుకోవడం విషాదకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను కాపాడాల్సిన పోలీసులే ఇలా వేధింపులు,హింసతో యువతను బలి తీసుకోవడం అత్యంత హేయమని అభివర్ణించారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ గాడి తప్పిందని,వారు భారత రాజ్యాంగం వదిలి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని భుజాన వేసుకున్నారని ఆక్షేపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ను మెప్పించేందుకే పోలీసులు యువకులను వేటాడుతున్నారా! అనే అనుమానాలు తలెత్తుతున్నాయని విమర్శించారు. మాదిగ యువకుడు క్రాంతి కుమార్ మరణం పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మాల మధుబాబు



డిమాండ్ చేశారు. కృష్ణలంక సీఐ నాగరాజు, పోలీసుల వేధింపులు భరించలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ క్రాంతికుమార్ స్వయంగా వీడియో వాంగ్మూలం ఇవ్వడం పోలీసులు ఆకృత్యాలకు నిదర్శనమని మాల మధుబాబు స్పష్టం చేశారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సిఐ నాగరాజును, పోలీసులను ఉద్యోగాల నుండి డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి ఆధ్వర్యంలో ప్రజాస్వామిక దళిత సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# "వన్ మంత్ -ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరులో ప్రత్యేక గ్రీవెన్స్ వేదిక

**అర్జీలపై క్షేత్రస్థాయి పరిశీలనతో నెల రోజుల్లో పరిష్కారం లక్ష్యం**

**ప్రతి సమస్యపై అధికారుల వ్యక్తిగత బాధ్యత, ప్రజలకు నేరుగా సమాచారం అందజేయాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

నంద్యాల /ఆత్మకూరు ,(కింగ్ )

ప్రజల నుంచి అందిన వినతులను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. "వన్ మంత్ ▪ ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని ఎం.ఎం. ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్,



జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాలతో పాటు, ప్రతి నెల ఒక నియోజకవర్గాన్ని ఎంపిక చేసి అక్కడ వరుసగా నాలుగు వారాల పాటు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత నెలలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో విజయవంతంగా అమలు చేసిన ఈ విధానాన్ని ప్రస్తుతం శ్రీశైలం నియోజకవర్గంలో కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను నేరుగా ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీలు సమర్పించిన వారికి రశీదులు అందజేసి, వచ్చే బుధవారం లోపు ఆయా గ్రామాల్లో అధికారుల బృందాలు పర్యటించి సమస్యలను పరిశీలిస్తాయని తెలిపారు. ఇళ్లు, స్థలాలు, పెన్షన్లు, రెవెన్యూ అంశాలు, భూమి వివాదాలు సహా ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ఈ వేదిక ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. సమస్యల స్వభావాన్ని బట్టి మండల, నియోజకవర్గ, జిల్లా లేదా రాష్ట్ర స్థాయిలో పరిష్కార చర్యలు చేపడతామని, రాష్ట్ర స్థాయికి పంపాల్సిన అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ పరిష్కారం సాధించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి, అవసరమైన చోట వ్యక్తిగతంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కార పురోగతిపై నిరంతర సమీక్ష ఉంటుందని, పూర్తి చేసిన పనులు, ఆర్థిక అనుమతులు పొందిన అంశాలు, ఆర్థికేతర సమస్యల పరిష్కార వివరాలను క్రమం తప్పకుండా నివేదించాల్సి ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. త్వరలో అధికారులకు ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించి కార్యాచరణను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు.

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు ప్రజా సమస్యల పరిష్కారాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. గతంలో జిల్లా కేంద్రానికే పరిమితమైన గ్రీవెన్స్ వ్యవస్థను ఇప్పుడు నియోజకవర్గ స్థాయికి విస్తరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం కలిగిందన్నారు. నెలలో వచ్చే నాలుగు వారాల్లో ఒక్కో మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో పరిష్కరించగల అంశాలను అక్కడికక్కడే పరిష్కరించడంతో పాటు, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా క్రమపద్ధతిలో తమ సమస్యలను అధికారులకు వివరించి, ఈ ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

ప్రత్యేక పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన వినతులు

1)ఆత్మకూరు మండలానికి చెందిన షేక్ రిజవ్వాన తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, ప్రస్తుతం తన అత్తగారి హౌస్‌హోల్డింగ్ మ్యాపింగ్‌లో తన భర్త హుస్సేన్ పేరు లేకపోవడంతో, ఆయన పేరును కూడా అదే హౌస్‌హోల్డింగ్ మ్యాపింగ్‌లో చేర్చాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

2)ఆత్మకూరు పట్టణానికి చెందిన సి. ఆది నారాయణమ్మ, సర్వే నంబర్ 971లో ఉన్న తన 3 ఎకరాల భూమిని బాలస్వామి అనే వ్యక్తి ఆక్రమించి సాగు చేస్తున్నాడని ఆరోపిస్తూ, సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. 3)ఆత్మకూరు పట్టణంలోని ఇందిరా గాంధీ నగర్‌కు చెందిన కె. రూపవతి, తాను గతంలో మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో పనిచేసినప్పటికీ ప్రస్తుతం ఉద్యోగం మానేశానని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వ రికార్డుల్లో తాను టీజీటీ హిందీ ఉపాధ్యాయురాలిగా, ప్రభుత్వ ఉద్యోగిగా నమోదై ఉండటంతో "తల్లికి వందనం" పథకం ప్రయోజనం అందడం లేదని పేర్కొన్నారు. అందువల్ల తన పేరును ప్రభుత్వ ఉద్యోగుల జాబితా నుంచి తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

# జూన్ 21న నిర్వహించే నీట్ పునఃపరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

**జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో 1,521 మంది విద్యార్థుల హాజరు**

**నీట్ అభ్యర్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం**

**సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దు**

**మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**



నంద్యాల ,(కింగ్ )

ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న నీట్ (యూజీ) పునఃపరీక్షను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి నీట్ పునఃపరీక్ష ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన నీట్ పునఃపరీక్షను జిల్లాలోని ఐదు కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీఎస్సీ డిగ్రీ కళాశాల, కేవీఎస్సీ డిగ్రీ మరియు జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలోని ఈ ఐదు కేంద్రాల్లో మొత్తం 1,521 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. వీరిలో 432 మంది విద్యార్థులు, 1,089 మంది విద్యార్థినులు ఉండగా, 10 మంది దివ్యాంగ అభ్యర్థులు కూడా పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5.15 గంటలకు ముగుస్తుందని తెలిపారు. దివ్యాంగ అభ్యర్థులకు ప్రత్యేక సడలింపులతో సాయంత్రం 6.20 గంటల వరకు సమయం కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అడ్మిట్ కార్డు మాత్రమే తీసుకురావాలని సూచించారు.

కష్టపడి సిద్ధమైన విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, స్నాక్స్, నిరంతర విద్యుత్ సరఫరా కోసం జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. అలాగే అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు.

నీట్ పరీక్షకు సంబంధించిన తప్పుడు ప్రచారాలు, వదంతులు సోషల్ మీడియాలో వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున వాటిని నమ్మవద్దని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత ఉన్నతాధికారులను సంప్రదించాలని కోరారు. పరీక్షా కేంద్రాలకు వచ్చే తల్లిదండ్రుల కోసం చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే విద్యార్థులు సులభంగా పరీక్షా కేంద్రాలను గుర్తించేందుకు అన్ని కేంద్రాల వద్ద దిశా నిర్దేశక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను సూచించారు.

జిల్లా ఎస్పీ సునీల్ షో రాణ్ మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. నిర్దేశిత గుర్తింపు పత్రాలు లేని అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలో ప్రవేశం కల్పించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ రామునాయక్, అదనపు ఎస్పీ యుగంధర్ బాబు, నంద్యాల ఏఎస్పీ మంద జావలి అల్ఫోన్స్, కలెక్టరేట్ ఏఓ సుభాకర్, డీఈఓ జనార్ధన్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ వెంకట రమణ, మున్సిపల్ కమిషనర్ శేషన్న, నీట్ కోఆర్డినేటర్ టి. వెంకటేశ్వర్లు, వివిధ పరీక్షా కేంద్రాల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.


# ఇంధన పొదుపుకు అధికారుల వినూత్న అడుగు

**వ్యక్తిగత వాహనాలకు బదులు బస్సుల్లో ప్రయాణించిన జిల్లా యంత్రాంగం**

**"వన్ మంత్ - ఫోర్ విజిట్"లో ఆదర్శంగా నిలిచిన నంద్యాల అధికారులు**

నంద్యాల ,(కింగ్ )

ఇంధన పొదుపు కేవలం నినాదంగా కాకుండా ఆచరణలో కూడా సాధ్యమేనని నంద్యాల జిల్లా అధికారులు నిరూపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "వన్ మంత్ - ఫోర్ విజిట్'' కార్యక్రమంలో భాగంగా జిల్లా యంత్రాంగం వ్యక్తిగత వాహనాలను పక్కనపెట్టి,



సమిష్టిగా బస్సుల్లో ప్రయాణిస్తూ ప్రజలకు ఆదర్శవంతమైన సందేశాన్ని అందించింది. శుక్రవారం శ్రీశైలం నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమానికి హాజరయ్యేందుకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ ప్రాంగణం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో బయలుదేరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంధన పొదుపు ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజలకు సందేశం ఇచ్చే ముందు అధికారులు స్వయంగా ఆచరణలో చూపించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. జిల్లా, డివిజనల్, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు విడివిడిగా వాహనాలు వినియోగించకుండా బస్సుల్లో సమిష్టిగా ప్రయాణించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని చెప్పారు. "వన్ మంత్ – ఫోర్ విజిట్" కార్యక్రమం ప్రతి పర్యటనలో ఇదే విధానాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంయుక్త తనిఖీలు, సమావేశాలు, అధికారిక పర్యటనల సందర్భాల్లో ఒకే వాహనాన్ని వినియోగించడం ద్వారా ఇంధన వినియోగం తగ్గడమే కాకుండా ప్రభుత్వ వ్యయాలు కూడా ఆదా అవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ చర్య ప్రజల్లో ఇంధన పొదుపుపై మరింత అవగాహన పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# నంద్యాల జిల్లా చదరంగం జట్ల ఎంపిక పోటీలు

## ప్రారంభించిన డాక్టర్ రామకృష్ణ రెడ్డి

## చదరంగం మేధో శక్తిని, ఏకాగ్రతను పెంచుతుంది: డాక్టర్ రవి కృష్ణ

నంద్యాల ,(కింగ్ )



నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో అమెచ్యూర్ నంద్యాల జిల్లా చదరంగం జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చదరంగం క్రీడ వలన బాలలలో మానసిక వికాసం కలుగుతుందని, చదరంగం క్రీడ విద్యార్థులలో గెలుపు ఓటములను స్వీకరించే మనస్తత్వం, ఓటమి చెందాక తిరిగి గెలవాలనే పట్టుదల పెంచే క్రీడా అన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ చదరంగం మేధో శక్తిని,ఏకాగ్రతను ఇనుమడింప చేస్తుందని అన్నారు. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాలని కోరారు. నిరంతర సాధన ద్వారా చదరంగంలో మెలకువలను, నైపుణ్యాన్ని పెంచుకోవాలని కోరారు. నంద్యాల జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి,డాక్టర్ రవి కృష్ణ చెస్ బోర్డుపై పావులు కదిపి చదరంగం పోటీలను లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్ సుజాత, కోచ్ సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆకాంక్షల సాధనలో ఆదర్శంగా టీమ్ ఎన్టీఆర్

- ప్రగతి పథంలో ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు బ్లాకులు
- లక్ష్యాల సాధనలో జిల్లా యంత్రాంగం కృషికి ప్రభారీ అధికారి ప్రశంసలు
- అన్నింటా 100 శాతం ప్రగతికి గొప్ప ముందడుగున్న నేలపట్ల అశోక్‌బాబు
- రైజ్, జీకేపీకే, ఇగ్నైట్ వంటి వినూత్న కార్యక్రమాలు వికాసానికి పునాదులన్న ప్రభారీ అధికారి

ఎన్‌టీఆర్ జిల్లా, ,(కింగ్ )




సామాజిక, ఆర్థిక, మానవాభివృద్ధిలో సమానత, సమ్మిళిత లక్ష్యంగా అమలవుతున్న ఆకాంక్షిత మండలాల కార్యక్రమం అమల్లో ఎన్‌టీఆర్ జిల్లా టీమ్ సమష్టి కృషి కారణంగా ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాల్లో స్పష్టమైన అభివృద్ధి నమోదైందని జిల్లా ప్రభారీ అధికారి, నేషనల్ వాటర్ మిషన్ డైరెక్టర్ నేలపట్ల అశోక్‌బాబు అన్నారు. లక్ష్యాల సాధనలో జిల్లా యంత్రాంగం చేసిన కృషిని ప్రశంసించారు.

ప్రభారీ అధికారి అశోక్‌బాబు ఈ నెల 17, 18 తేదీల్లో పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లో పర్యటించారు. వ్యవసాయ క్షేత్రాలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లు తదితరాలను సందర్శించారు. క్షేత్రస్థాయిలో అభివృద్ధి సూచికల్లో ప్రగతిని పరిశీలించారు. శుక్రవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో విద్య, వైద్య ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, గ్రామీణ నీటి సరఫరా, డీఆర్‌డీఏ, పశు సంవర్థక, వ్యవసాయం తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో నేలపట్ల అశోక్‌బాబు.. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొన్నారు. 2023, జనవరి 7న దేశ వ్యాప్తంగా ఆకాంక్షిత బ్లాకుల కార్యక్రమం (ఏబీపీ) ప్రారంభం కాగా మొత్తం 513 బ్లాకులను గుర్తించగా మన జిల్లాలో ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలులో కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ బ్లాకుల్లో విద్య, వైద్య ఆరోగ్యం, వ్యవసాయ, అనుబంధరంగాలు, మహిళా శిశు సంక్షేమం తదితరాల్లో వివిధ సూచికల పురోగతిని కలెక్టర్ లక్ష్మీశ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సంపూర్ణత అభియాన్ – 1 కింద ఆరు సూచికల్లో 100 శాతం ప్రగతిని నమోదుచేసి నీతి ఆయోగ్ నుంచి బంగారు పతకాలు అందుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా సంపూర్ణత అభియాన్ 2.0 కింద ఆరు సూచికల్లో 100 శాతం ప్రగతిని నమోదు చేసినట్లుగా వివరించారు. మొత్తం 38 సూచికల్లో పెనుగంచిప్రోలులో 27, ఇబ్రహీంపట్నంలో 25 సూచికల్లో 100 శాతం ప్రగతి లక్ష్యాన్ని చేరుకున్నామని, అన్ని సూచికల్లోనూ ఇదే రకమైన అభివృద్ధికి ప్రణాళికాయుత కృషిచేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఈ లక్ష్యాన్ని చేరుకుంటామని పేర్కొన్నారు. గౌరవ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పాటు ఆర్‌టీఐహెచ్, అలెప్, వికాస వంటి కార్యాలయాల సహాయసహకారాలు కీలకంగా ఉంటున్నాయని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

వికాసానికి వినూత్న కార్యక్రమాలు: ప్రభారీ అధికారి అశోక్‌బాబు

జిల్లా, మండలస్థాయి అధికారులు,బ్లాక్ కోఆర్డినేటర్లు, ప్రజాప్రతినిధులు, ఫ్రంట్‌లైన్ వర్కర్లు, నిబద్ధతతో పనిచేస్తూ లక్ష్యాలను చేరుకుంటున్నారని, వీరందరికీ నీతి ఆయోగ్ తరఫున అభినందనలు తెలియజేస్తున్నట్లు ప్రభారీ అధికారి అశోక్‌బాబు అన్నారు. రైజ్ (రూరల్ ఇన్క్యూబషన్, స్కిలింగ్ & ఎంటర్ప్రెనూరేషిప్), ఇగ్నైట్, ఏఐ ఫర్ ష్యూర్, ఎస్‌హెచ్‌జీ షార్క్ ట్యాంక్, స్మార్ట్ అగ్రికల్చర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (గ్రామీణ్ కృషి పరిజ్ఞాన కేంద్రం–జీకేపీకే) వంటి వినూత్న కార్యక్రమాలు జిల్లాలో కలెక్టర్ సారథ్యంలో అమలవుతున్నాయని పేర్కొన్నారు. గత పర్యటన నాటికి ఈసారి పర్యటనకు రెండు బ్లాకుల్లో విశేష అభివృద్ధి కనిపించిందని.. ఇదే స్ఫూర్తితో అన్ని అంశాల్లోనూ 100 శాతం ప్రగతికి కృషిచేయాలన్నారు. ప్రధానంగా విద్య, వైద్య ఆరోగ్యం, పోషణ తదితర అంశాలపై దృష్టిసారించాలని అశోక్‌బాబు అన్నారు. సమావేశంలో విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను, నందిగామ ఆర్‌డీవో అనిల్ కుమార్, సీపీవో డీవీఎస్‌ఆర్ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డీఎంహెచ్‌వో డా. ఇందుమతి, డీఈవో ఎల్.చంద్రకళ, ఎంపీడీవోలు శకుంతల, శ్రీను, రామకృష్ణ నాయక్, ఇబ్రహీంపట్నం బ్లాక్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్, పెనుగంచిప్రోలు బ్లాక్ కోఆర్డినేటర్ జి.మోహన్ సందీప్, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం - ఎమ్మెల్యే బీ.వి

## ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

## ఎరువులు పంపిస్తున్న ఎమ్మెల్యే బీవీ





ఎమ్మిగనూరు ,(కింగ్ )

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కడిమెట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఎమ్మెల్యే బీ.వీ రైతులకు ఆన్‌లైన్ విధానం ద్వారా ఎరువుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహకార సంఘానికి సంబంధించిన ఎరువుల గోదామును ప్రారంభించారు. రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఓటీపీ విధానం ద్వారా పారదర్శకంగా ఎరువులను పంపిణీ చేయడం జరిగింది.

అనంతరం సహకార సంఘం ఆవరణలో రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్ని విధాలుగా రైతులకు అండగా నిలుస్తోందన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రైతుల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, స్థానికంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

అనంతరం గత నెలలో ఎర్రకోట గ్రామ పర్యటన సందర్భంగా గ్రామస్తులు చేసిన విజ్ఞప్తి మేరకు ఎల్ఎల్‌సీ కాలువను పరిశీలించారు. కాలువకు అడ్డంగా ఉన్న మట్టి పిల్లర్లు, సిమెంట్ దిమ్మలు, కట్టెలను తొలగించి నీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే మీరా, ఔరా–82, ఔరా–83, ఔరా–84 కాలువలను సందర్శించి, కాలువల ఇరువైపులా పెరిగిన కంపు చెట్లను తొలగించి నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కడిమెట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు విరూపాక్షి రెడ్డి, మాజీ అధ్యక్షులు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కేటీ వెంకటేశ్వర్లు, ఎమ్మిగనూరు వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు గౌస్ పీరా, డైరెక్టర్లు మురళీకృష్ణారెడ్డి, కేసన్న, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రాంతి కుమార్ ది పోలీసుల కుల దురహంకార హత్యే

## కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్)

## కెవిపిఎస్ మండల ప్రధాన కార్యదర్శి తిమ్మన్న

ఎమ్మిగనూరు. ,(కింగ్ )




మాదిగ యువకుడు పేరుపోగు క్రాంతి కుమార్ మృతి పోలీసుల కుల దురహంకార హత్యేనని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ( కెవిపిఎస్) ఎమ్మిగనూరు మండల ప్రధాన కార్యదర్శి సోగనూరు సప్పోగు తిమ్మన్న,మండల ఉపాధ్యక్షులు కలు గొట్ల మాల రాజా రమేష్ ,టౌన్ ప్రెసిడెంట్ సుమాల,రాజు,సహాయ కార్యదర్శి గుంటెప్ప,గంగన్న లు డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విజయవాడలోని మాదిగ సామాజిక వర్గానికి చెందిన యువకుడు పేరుపోగు క్రాంతికుమార్ మృతి చెందడం అత్యంత విషాదకరమైన ఘటన అని, మూడు నెలలుగా పోలీసులు స్టేషన్ కు పిలిపించి వేధింపులకు గురి చేశారని కుటుంబ సభ్యులు చెబుతున్నారన్నారు. తన మరణానికి కృష్ణలంక సీఐ నాగరాజే కారణమని క్రాంతి కుమార్ సెల్ఫీ వీడియోలో పేర్కొన్నట్లు వస్తున్న సమాచారం దళితుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. ఎస్సీ వర్గానికి చెందిన ఒక యువకుడు నిరంతర పోలీసు వేధింపుల మధ్య ప్రాణాలు కోల్పోవడం సాధారణ ఘటనగా చూడలేమన్నారు. ఇది కేవలం ఒక మరణం కాదని కుల అహంకారం, అధికార దుర్వినియోగం, అణ గారిన వర్గాల పట్ల ఉన్న వివక్ష అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత వర్గాలపై హత్యలు, అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలు, అరాచకాలు మితిమీరి పోయావని ఆవేదన చెందారు. అధికార పార్టీ అండతో పోలీసులు మాదిగ యువకుడు క్రాంతి కుమార్ ను వెంటాడి, వేటాడి వేధించి ఆత్మహత్యకు కారణమయ్యారని క్రాంతి కుమార్ మరణం పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి నాయకులు, పోలీసులు భారత రాజ్యాంగం వదిలి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని భుజాన వేసుకున్నారని ఆరోపించారు. కృష్ణలంక పోలీసుల వేధింపులు భరించలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ క్రాంతి కుమార్ స్వయంగా వీడియో వాంగ్మూలం ఇవ్వడం పోలీసులు ఆకృత్యాలకు నిదర్శనమని కెవిపిఎస్ నాయకులు స్పష్టం చేశారు. దళితులపై దాడులు పరంపరంగా కొనసాగితే దళితుల ఆగ్రహం చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ఆలయాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయండి.

## దేవాదాయ శాఖ అధికారులకు మంత్రి బీసీ సూచన.

బనగానపల్లె ,(కింగ్ )



దేవాదాయ శాఖలో పనిచేయుచున్న ప్రతి అధికారి దేవస్థానములు అభివృద్ధే ధ్యేయమనే భావనతో పని చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం నందు జిల్లా దేవస్థానముల ఇంజనీరింగ్, కార్య నిర్వహణ అధికారులతో దేవస్థానముల యందు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి.జి.యఫ్ నిధుల నుండి జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పనిచేయు విషయముపై పటిష్టమైన చర్యలు గైకుని పనులు వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా దేవస్థానం యందు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఈఈ శ్రీనివాస ప్రసాద్, జిల్లా దేవదాయ శాఖ అధికారి పాండురంగారెడ్డి, నందవరం ఈవో శ్రీనివాసరెడ్డి, ఈవోలు వీరయ్య, తనిఖీ అధికారి హరిచంద్ర రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఏఈ కిరణ్, స్థపతి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

"This newspaper/periodical is published by KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH from D. NO. 24-11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA, 4TH LINE, NEAR MAHALAXMIGUDI, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003.on behalf of KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by PETTA VENKATA SURYANARAYANA at SREE SESHASAI ENTERPRISES. 3-88, CHANDRA THEATRE, MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH - 521151."